
సమయం ఆరున్నర దాటింది. శీతాకాలం కావడంతో బాగా చీకటిపడింది. వీధి దీపాలు వెలిగాయి.


సరోజ, హరి అప్పటికే గంట నుంచి వాళ్లింటి అరుగు మీద కూర్చుని రవీంద్ర కోసం ఎదురుచూస్తున్నారు... సమీపంలో ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో ఉండుండీ ఆటోలు, సిటీబస్‌లూ ఆగుతున్నాయి. ఎవరెవరో దిగుతున్నారే గానీ రవీంద్ర జాడలేదు.

"అన్నయ్య ఇంకా రాలేదేమిటి, క్రికెట్‌బ్యాట్ కొనడానికి ఇంతసేపా?" అసహనంగా అన్నాడు హరి.

"ఏమిట్రోయ్... అన్నయ్య నిజంగా నీకు క్రికెట్ బ్యాట్ తెస్తాడనే అనుకుంటున్నావా? అది జరగని పని. నాకు మాత్రం తప్పనిసరిగా కొత్త బట్టలు పట్టుకొస్తాడు... బట్టలకొట్లోనే అన్నయ్యకు ఆలస్యమై ఉంటుంది!" అంది తమ్ముణ్ణి ఏడిపించే ధోరణిలో సరోజ.



చోడిశెట్టి శ్రీనివాసరావు




"పోవే... నీవన్నీ అబద్ధాలే!" సరోజ మాటలు పెద్దగా పట్టించుకోలేదు హరి.

"అలాగే చూస్తూ కూచో. నేను చెప్పింది నిజమో - అబద్ధమో అన్నయ్య రాగానే నీకే తెలుస్తుంది" అంది దృఢ స్వరంతో సరోజ.

అక్క అంత కచ్చితంగా చెప్పడంతో హరి మనస్సులో అనుమానం తలెత్తింది. ఎప్పటి నుంచో క్రికెట్ బ్యాట్ కొనుక్కోవాలన్న కోరిక ఉంది వాడికి. తండ్రినడిగితే ఇదిగో అదిగో అంటూ రోజులు గడుపుకొస్తున్నాడే గానీ ఇంతవరకూ కొనడం జరగలేదు. ఇప్పుడా కోరిక నెరవేరుతుందనుకుంటున్న తరుణంలో సరోజ అలా అనడం హరికెంతో బాధనూ, కోపాన్నీ కలిగించాయి.

"ఉండు అమ్మను కనుక్కొచ్చి నీ పని చెబుతాను" అని హరి లోపలి కెళ్లబోతుంటే వంట పని ముగించుకొని సుందరమ్మే అక్కడికొచ్చింది. ఆవేశపడిపోతూ తల్లికి తన ఫిర్యాదు వినిపించాడు హరి. సుందరమ్మ నవ్వుతూ "అన్నయ్య మనందరికీ తను చెప్పినవి తెస్తాడురా. కాసేపు ఓపికపట్టు" అంది.

'ఇప్పుడేమంటావ్' అన్నట్టు అక్క వైపు చూశాడు హరి. ఇంకేమైనా అంటే తల్లి తిడుతుందని మిన్నకుండిపోయింది సరోజ.

"రోజూ అయిదున్నరయ్యేసరికల్లా వచ్చేసే మీ నాన్నగారు ఈ వేళ ఇంకా రాలేదు. ఏమైందో?" ఆలోచనగా అంటూ గుమ్మందగ్గరే కూర్చుంది సుందరమ్మ.

ఆమె భర్త శ్రీపతి ఓ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. వాళ్లకి ముగ్గురు పిల్లలు. పెద్దవాడు రవీంద్ర పదోతరగతి రెండోసారి కూడా గట్టెక్కలేకపోవడంతో చదువుకు స్వస్తి చెప్పాడు. ఇష్టమొచ్చినట్టు తిరుగుతున్న రవీంద్రకు శ్రీపతి తీవ్ర ప్రయత్నంతో ఈ మధ్యనే ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం స్థిరంగా చేస్తాడో చెయ్యడో అనుకున్న రవీంద్ర బుద్ధిగా డ్యూటీకి వెళ్లి రావడమే కాక మొదటినెల జీతం అందుకోగానే ఇంట్లో వాళ్లందరికీ కొత్త

బట్టలు కొని తెస్తానని చెప్పాడు. హరి తనకు కొత్తబట్టలకు బదులు క్రికెట్‌బ్యాట్ కావాలన్నాడు. తప్పక తెస్తానని తమ్ముడికి మాటిచ్చాడు రవీంద్ర. వాడిలో వచ్చిన మార్పుకు ఆ దంపతులెంతగానో మురిసిపోయారు.

రవీంద్ర మొదటినెల జీతం అందుకునేది ఆ రోజే. అందుకే సరోజ, హరి అన్నగారి రాక కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

వాళ్లలా ఎదురుచూసిన మరికొంతసేపటికి కూడలిలో సిటీబస్ దిగి రిక్తహస్తాలతో ఇంటికొచ్చాడు రవీంద్ర. వాడి ముఖంలో ఏ కోశానా కళాకాంతుల్లేవు. ఉత్తచేతులూపుకుంటూ వచ్చిన అన్నగారిని చూడగానే సరోజ, హరి తెల్లబోయారు.

"ఏరా అలా ఉన్నావ్?" అడిగింది సుందరమ్మ.

నిర్లిప్తంగా తల్లివైపు చూశాడు రవీంద్ర.

"చెప్పరా, ఏం జరిగింది?" వాడు మాట్లాడక పోవడంతో కంగారుగా అందామె. తల్లి మళ్లీ మళ్లీ అడిగిన మీదట – "జీతం తీసుకుని మీకు బట్టలవీ కొనాలని బజారు కెళ్లానమ్మా. అక్కడెవరో నా జేబు కొట్టేసారు!" అన్నాడు కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతూండగా రవీంద్ర.

ఆ మాటలతో సుందరమ్మ గుండె గుభేలుమంది. రవీంద్ర అందుకున్న మొదటినెల జీతం ఆ విధంగా పోవడం ఆమెకెంతో బాధనిపించిది. తమ ఆశ – నిరాశ కావడంతో హరి, సరోజల ముఖాలు కళతప్పాయి.

ఎంత బాధపడ్డా పోయింది తిరిగిరాదు కనుక తన బాధను దిగమింగుకొని ముగ్గురు పిల్లలకూ భోజనాలు వడ్డించింది సుందరమ్మ.

* * *

"అదేమండీ, ఇంత ఆలస్యమైంది?" అంది సుందరమ్మ.

"చెబుతాగానీ మీరంతా అలా ఉన్నారేమిటి? రవీంద్ర వచ్చి ఎంతసేపైంది?" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ శ్రీపతి.

"వాడూ ఇప్పుడే వచ్చాడండీ!" అని అసలు విషయం చెప్పడమా – మానడమా అన్న సందిగ్ధంలో ఉండిపోయింది సుందరమ్మ.

ఇంతలో హరి "నాన్నగారూ, అన్నయ్య జేబులో డబ్బు బజార్లో ఎవరో దొంగిలించారటండీ!" అన్నాడు చటుక్కున.

"అయ్యయ్యో... జేబులో డబ్బు పోయిందా!?" ఆశ్చర్యంగా అన్నాడు శ్రీపతి.

"ఔనండీ... వీడు జీతం తీసుకుని మనకు బట్టలు కొనడానికి బజారు కెళ్లాడట... అక్కడెవరో ముదనష్టపు వాళ్లు జేబు ఖాళీ చేసారట!" బాధగా అంది సుందరమ్మ.

"ఏరా రవీ, డబ్బు నిజంగానే పోయిందా?" అడిగాడు రవీంద్ర ముఖంలోకి పరీక్షగా చూస్తూ శ్రీపతి.

తలూపాడు రవీంద్ర.

"డబ్బు జేబులో ఉందో లేదో ఎక్కడ చూసుకున్నావు నువ్వు?"

"బట్టల షాపులో కెళ్లాక..."

"అదేరా, ఆ షాపు పేరు చెప్పు. నేను వెళ్లి కనుక్కుంటాను!" అన్నాడు శ్రీపతి.

తడబడ్డాడు రవీంద్ర.

వాడి తడబాటుని గ్రహించిన శ్రీపతి పొంగుకొస్తున్న ఆవేశాన్ని నిగ్రహించుకొని, "చూడు రవీంద్రా! రేపో మాపో పెళ్లిచేసుకుని బాధ్యతల్ని

ఒంటబట్టించుకోవాల్సిన వయస్సు నీది! ఈ సమయంలో ఇంత బాధ్యతారాహిత్యంగా పిచ్చి వాడిలా ప్రవర్తించడం ఏమీ బాగుండలేదు...”

“ఏమిటండీ, ఏమైంది?” భర్త మాటలకు అడ్డొచ్చి అంది సుందరమ్మ.

“ఏం చెప్పమంటావోయ్, మా టైమ్‌కీపరు గురుమూర్తిగారబ్బాయి వీడికి మిత్రుడు కదా... ఆ అబ్బాయితో పందెం వేసాడు!”

“దేనికేమిటీ...”

“వెధవకి ఉందిగా పిచ్చి! ఆ పిచ్చి వీణ్ణి వదిలేలా లేదు”.

“బాగుందండీ, అసలు విషయమేమిటో చెప్పకుండా మీరు నన్ను బాధపెడతారా?”

“ఇలాంటి వాళ్లను కన్నందుకు బాధపడక తప్పదోయ్” అంటూ కొన్ని క్షణాలు ఆగి, “మన సుపుత్రుడు ఉద్యోగంలో చేరిన మూడోరోజునే ఈయన గారి అభిమాన హీరో సినిమా విడుదలైంది. ఆ సినిమా వందరోజులు ఆడితే గురుమూర్తి గారబ్బాయి వీడికి మూడువేల రూపాయలిస్తాడు... వందరోజులు ఆడకపోతే వీడా అబ్బాయికి తన నెల జీతం ఇచ్చెయ్యాలి. ఇదీ పందెం!... తీరా, చూస్తే ఆ సినిమా వచ్చిన మూడు వారాలకే వెళ్లిపోయింది. దాంతో మన బాబుగారు మొదటినెల జీతం అందుకుంటూనే ఆ అబ్బాయికి సమర్పించుకొచ్చి, మీకు చక్కని కథ అల్లి చెప్పాడన్నమాట”.

“ఇదంతా నిజమే?” నిర్ఘాంతపోతూ అంది సుందరమ్మ.

“నిజమేనోయ్. నేను డ్యూటీ దిగి వచ్చే ముందే - సీలింగ్ ఫ్యాన్ తిరగడం లేదని చెప్పి గురుమూర్తిగారు నన్ను వాళ్లంటికి తీసికెళ్లారు. సరిగ్గా మేం వెళ్లిన సమయానికే వాళ్లబ్బాయి పందెం గెలిచినందుకు పొంగిపోతూ ఇంట్లో వాళ్ల వద్ద మహాగొప్పలు పోతున్నాడు. ఏమిటా అని గురుమూర్తి గారు ఆరా తీసేసరికి ఈ విషయం బయట పడింది!” అన్నాడు బాధగా శ్రీపతి.

“బాగుందిరా రవీంద్రా!... నిన్ను అభిమానించే నీవాళ్లకేం తీసుకురాకపోయినా నీ అభిమాన నటుడి సినిమా కోసం జీతమంతా ఇచ్చేసి రావడం చెప్పలేనంత బాగుంది!! నువ్వు బాగుపడతావని ఆశపడ్డాం గానీ, అది మా భ్రమని తేలిపోయిందిరా” అంది ఆవేదనగా సుందరమ్మ.

“ఒరేయ్ రవీంద్రా! సినిమాలు చూడకూడదని - సినిమా నటులపై అభిమానం ఉండకూడదనీ నేను అనడం లేదు. కానీ అదొక పిచ్చిగా - జీతానికి జీతం పందెం వేసి జీవితాన్ని తారుమారు చేసేదిగా ఉండకూడదు. చేతనైతే నువ్వు అభిమానించే నటుడు ఆ స్థాయికి ఎలా చేరుకున్నాడో ఆలోచించాలి - నీవు చేపట్టిన వృత్తిలో పట్టుదలతో పైకి వచ్చి పదిమంది చేత నువ్వు అభిమానించబడటానికి ప్రయత్నించు. ఇకనైనా ఇటువంటి పిచ్చిపనులు మానేసి బుద్ధిగా ఉండు, లేకుంటే భవిష్యత్తులో బాధపడేది నువ్వే!... ఇదిగో నీ మొదటి నెల జీతం... వాళ్లబ్బాయి వద్ద నుంచి లాక్కొని గురుమూర్తిగారు నాకు ఇచ్చేసారు” అన్నాడు సౌమ్యంగానే శ్రీపతి.

తండ్రి చేతిలోని డబ్బందుకొని తల్లికిచ్చి “రేపు నువ్వూ, నాన్నగారూ బజారుకెళ్లి కొత్త బట్టలు, తమ్ముడికి క్రికెట్‌బ్యాటూ తీసుకోండి. ఇక ముందు మీతో చెప్పకుండా నేను సినిమా క్కూడా వెళ్లను” అన్నాడు నీళ్లు నిండిన కళ్లతో రవీంద్ర. ●